# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 13-04-2025** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **ఒంటిమిట్టను అభివృద్ధి చేసేందుకు బృహత్తర ప్రణాళిక రూపొందించాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు**
2. **భూభారతి పోర్టల్‌పై ప్రతి మండలంలో అవగాహన సదస్సు నిర్వహించనున్నామని తెలంగాణ ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి వెల్లడించారు.**
3. **వెనుకబడిన వర్గాల అభివృద్ధి, సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆంధ్రప్రదేశ్ మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అన్నారు.**
4. **తెలంగాణలోని గిరిజన ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనే ప్రభుత్వ లక్ష్యమని పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క పేర్కొన్నారు.**
5. **దేశ చరిత్రలో అత్యంత బాధాకర ఘటనగా నిలిచిన 'జలియన్ వాలాబాగ్' మారణకాండ జరిగి నేటికి 106 సంవత్సరాలు పూర్తయ్యాయి.**

==========================

ఒంటిమిట్టను ఆధ్యాత్మిక పర్యాటక ప్రాంతంగా మార్చేందుకు బృహత్తర ప్రణాళిక రూపొందించాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. వైయస్సార్ కడప జిల్లాపర్యటనలో భాగంగా ఒంటిమిట్ట ఆలయ అభివృద్ధి, యాత్రికుల సౌకర్యాలపై ముఖ్యమంత్రి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ, ఆలయాన్ని సందర్శించే యాత్రికుల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో రద్దీకి అనుగుణంగా సౌకర్యాలను కల్పించాల్సిన అవసరం ఉందని అన్నారు. తిరుపతి– కాణిపాకం– తాళ్లపాక, గండికోట – ఒంటిమిట్ట– శ్రీ కాళహస్తి ప్రాంతాలను కలుపుతూ ఆధ్యాత్మిక, సాంస్కృతిక పర్యాటక సర్క్యూట్ అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి అధికారులకు దిశానిర్దేశం చేశారు.

---

భూభారతి పోర్టల్‌పై ప్రతి మండలంలో అవగాహన సదస్సు నిర్వహించాలని తెలంగాణ ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. భూభారతిని రేపటి నుంచి అమలు చేయనున్న నేపథ్యంలో ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి నిన్న కీలక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భూభారతి పోర్టల్‌ను మరింత బలోపేతం చేస్తామన్నారు. ప్రజలకు సౌకర్యంగా ఉండేలా భూభారతి పోర్టల్‌ను రూపకల్పన చేశామని తెలిపారు. రాష్ట్రంలో ఎంపిక చేసిన 3 మండలాల్లో ఈ పోర్టల్‌ను పైలెట్ ప్రాజెక్టుగా

అమలు చేయనున్నామని చెప్పారు. పైలట్ ప్రాజెక్టులో ప్రజల నుంచి సలహాలు, సూచనలు స్వీకరించనున్నామని తెలిపారు.

---------------------------

వెనుకబడిన వర్గాల అభివృద్ధి, సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అన్నారు. ప్రకాశం జిల్లా సింగరాయకొండ మండలం పాకల ఎస్సీ కాలనీలో 12 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించిన ఆర్వో ప్లాంట్లను, డ్వాక్రా మహిళా సమావేశ మందిరాన్ని అంబేద్కర్ జయంతి సందర్భంగా ఏర్పాటు చేసిన వాలీబాల్ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ, రాష్ట్రంలో 300 కోట్ల రూపాయలతో ఎస్సీ వసతి గృహాల నిర్మాణం, మరమ్మత్తులు చేపట్టామని చెప్పారు. ప్రధానమంత్రి ఆదర్శ గ్రామ యోజన కింద ఎస్సీ కాలనీల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని మంత్రి తెలియజేస్తూ,

వాయిస్ .. 33 సెకన్లు

---------------------------

పరిశ్రమలకు ఏకగవాక్ష విధానంలో అనుమతులు ఇస్తున్నామని రహదారులు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి తెలిపారు. రాయచోటిలోని కలెక్టర్ కార్యాలయంలో అన్నమయ్య జిల్లా అభివృద్ధిపై సంబంధిత అధికారులతో మంత్రి నిన్న సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధితో పాటు సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తోందని అన్నారు. జిల్లాలో అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని తాగునీటి ఎద్దడి నివారణకు జిల్లా ఖనిజాభివృద్ధి నిధులు–డీఎంఎఫ్ మంజూరు చేశామని తెలిపారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో మే 12 నుంచి ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించనున్నామని రాష్ట్ర ఇంటర్ బోర్డు ప్రకటించింది. ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు మే 12 నుంచి మే 20 వరకు పరీక్షలు నిర్వహించనున్నారు. ప్రాక్టికల్ పరీక్షలు మే 28 నుంచి జూన్ 1 వరకు జరగనున్నాయి. జూన్ 4న ఎథిక్స్ నైతికత మరియు మానవ విలువలు పరీక్ష, జూన్ 6న పర్యావరణ విద్య నిర్వహించనున్నా మని ఒక ప్రకటనలో తెలిపింది. కాగా నిన్న విడుదలైన ఇంటర్మీడియట్ ఫలితాలలో ప్రథమ సంవత్సరంలో 70 శాతం ఉత్తీర్ణత సాధించగా.. ద్వితీయ సంవత్సరంలో 83 శాతం మంది ఉత్తీర్ణత నమోదైంది.

---------------------------

తెలంగాణలోని గిరిజన ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనే ప్రభుత్వ లక్ష్యమని పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క అన్నారు. ములుగు జిల్లా లక్నవరంలోని పలు లోతట్టు గ్రామాలకు బీటీ రహదారుల నిర్మాణానికి మంత్రి నిన్న శంకుస్థాపనలు చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, జిల్లాలోని సర్వాపూర్, జగన్నగూడెం మధ్య ఉన్న బొగ్గులవాగుపై 5 కోట్ల రూపాయలతో వంతెన నిర్మాణం చేపట్టనున్నామని తెలిపారు. ఇళ్లులేని వారికి త్వరలోనే ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని మంత్రి పేర్కొంటూ,

వాయిస్.. 22 సెకన్లు

---------------------------

తిరుమల తిరుపతి దేవస్థానం పరిధిలోని శ్రీ వేంకటేశ్వర గోశాలలో ఆవుల మరణాలపై జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదని ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర స్పష్టం చేశారు. గుంటూరు జిల్లా మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ, ఆవుల సంరక్షణకు అన్ని చర్యలు టీటీడీ తీసుకుంటుందని తెలిపారు. జియో ట్యాగింగ్ చేపట్టి ఎప్పటికప్పుడు తగిన జాగ్రత్తలు చేపడుతోందని ఆయన తెలియజేస్తూ,

వాయిస్ 30 సెకన్లు

---------------------------

దేశ చరిత్రలో అత్యంత బాధాకర ఘటన అయిన 'జలియన్ వాలాబాగ్' మారణకాండ జరిగి నేటికి 106 సంవత్సరాలు పూర్తయ్యాయి. బ్రిటీష్ వారి దురహంకారానికి వెయ్యిమందికిపైగా భారతీయులు ప్రాణాలు కోల్పోయారు. 1919 ఏప్రిల్ 13న పంజాబ్‌లోని అమృత్ సర్ పట్టణంలో జలియన్ వాలా బాగ్ అనే తోటలో వైశాఖి పండుగ జరుపుకోవడానికి వేలాది మంది సిక్కులు సమావేశమయ్యారు. వారిపై... ఆంగ్లేయులు ఒక్క సారిగా కాల్పులు జరిపారు. ఈ అనూహ్య ఘటనతో జలియన్ వాలాబాగ్‌లో సమావేశమైన ప్రజలు ఆందోళనకు గురయ్యారు. ఏకధాటిగా పది నిమిషాలపాటు విచక్షణారహితంగా బ్రిటిష్ సైన్యం కాల్పులు కొనసాగించింది. బయటకు వెళ్లేందుకు దారి లేకుండా అన్ని ద్వారాలు మూసిఉండటంతో సుమారు వెయ్యి మందికి పైగా మరణించారు. ఈ దురాగాతాన్ని భారత స్వాతంత్ర్య చరిత్రలో అతి పెద్ద దుర్ఘటనగా ప్రస్తావిస్తారు.

---------------------------

తెలంగాణలోని ప్రతి జిల్లాలో రైతు మేళాలు నిర్వహిస్తామని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. హైదరాబాద్ నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో నాలుగు రోజులపాటు జరగనున్న రైతు మహోత్సవాన్ని మంత్రి నిన్న సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, వ్యవసాయంలో వస్తున్న మార్పులను తెలియజేసేలా పలు స్టాళ్లను ఏర్పాటు చేసారని చెప్పారు. నాణ్యమైన దేశీయ విత్తనాలను సాగు చేస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని అన్నారు. పర్యావరణహితమైన సేంద్రీయ ఎరువులు వాడి నాణ్యమైన పంట ఉత్పత్తులను పండించాలని మంత్రి రైతులకు సూచించారు.

---------------------------

వేసవి రద్దీ దృష్ట్యా మరిన్ని ప్రత్యేక రైళ్లను నడపనున్నామని దక్షిణ మధ్య రైల్వే వెల్లడించింది. విశాఖ-బెంగళూరు, విశాఖపట్నం- తిరుపతి, విశాఖపట్నం- కర్నూలు సిటీ మధ్య మొత్తం 42 వేసవి వారాంతపు ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు పేర్కొంది. ఈ రోజు నుంచి మే నెలాఖరు వరకు ఈ రైళ్లు అందుబాటులో ఉండనున్నాయని వెల్లడించింది. ప్రయాణికులు ఈ సౌకర్యాన్ని వినియోగించుకోవాలని రైల్వే అధికారులు కోరారు.

---------------------------

ఇండియన్ ప్రీమియర్ లీగ్-ఐపీఎల్‌లో ఈ రోజు రెండు మ్యాచ్‌లు జరుగుతాయి. జైపూర్ వేదికగా రాజస్థాన్ రాయల్స్, బెంగళూరు రాయల్ ఛాలెంజర్స్, ఢిల్లీ వేదికగా ఢిల్లీ క్యాపిటల్స్, ముంబై ఇండియన్స్ మధ్య మ్యాచ్‌లు జరగనున్నాయి. కాగా.. నిన్న హైదరాబాద్ వేదికగా పంజాబ్ కింగ్స్, సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ విజయం సాధించింది. ముందుగా నిర్ణీత 20 ఓవర్లలో పంజాబ్ కింగ్స్ 6 వికెట్ల నష్టానికి 245 పరుగులు చేసింది. 246 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన సన్‌రైజర్స్ 18.3 ఓవర్లలో రెండు వికెట్ల కోల్పోయి 247 పరుగులు చేసి విజయం సాధించింది.

=====================